ప్రజాశక్తి

ఆదివారం మే 5 2024 | 8 పేజీలు | శ్రీకాకుళం

నాయకా...

నిర్లక్ష్యం చేయొద్దు

- మండుతున్న ఎండలు
- ప్రచారాల్లో జాగ్రత్తలు అవసరం

(...6లో)

పోస్టల్ బ్యాలెట్ ప్రశాంతం

- నరసన్నపేటలో ఒక్కసారిగా చొరబడిన ఉద్యోగులు
- 7004 మంది ఓటు హక్కు వినియోగం

నరసన్నపేట : ఓటు వేసేందుకు కేంద్రంలోకి ఒక్కసారిగా చొరబడిన ఉద్యోగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల కోసం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. ప్రిసైడింగ్ అధికారులు (పిఒలు), సహాయ ప్రిసైడింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులు, పోలీసు సిబ్బంది, ఇతర ఎన్నికల సిబ్బంది కోసం జిల్లా కేంద్రంతో సహా ఎనిమిది నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో 7004 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచే ఓటు వేసేందుకు బారులు తీరారు. నరసన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో పోలింగ్ సిబ్బంది ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ చేపట్టారు. అప్పటికే ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో ఉన్న ఉద్యోగులు, ఉదయం పది గంటల సమయంలో ఒక్కసారిగా కేంద్రంలోకి చొరబడడంతో కొంత గందరగోళం చోటుచేసుకుంది. అదే కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో వైసిపి, టిడిపి ఏజెంట్ల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుని తోపులాటకు దారితీసింది.

ఓటింగ్‌ను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

పాతపట్నంలోని (మిగతా...2లో)

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్, సిపిఎం నాయకులు

స్వప్రయోజనాల కోసం రాష్ట్రం తాకట్టు

- బిజెపి పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలి
- 'ఇండియా' ఫోరం అభ్యర్థులను గెలిపించాలి
- కాంగ్రెస్, సిపిఎం నాయకుల పిలుపు

ప్రజాశక్తి - ఆమదాలవలస

స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వద్ద రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి తాకట్టు పెట్టాయని డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, (మిగతా...2లో)

మందస : ఎన్నికల ప్రచారం చేస్తున్న రోహిత్, శిరీష

వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలి

సినీ నటుడు నారా రోహిత్

ప్రజాశక్తి - పలాస, మందస

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో సాగనంపాల్సిన సమయం వచ్చిందని సినీ నటుడు నారా రోహిత్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి పలాస అభ్యర్థి గౌతు శిరీషకు మద్దతుగా మందస మండలం మధ్యదేవపురం, సవరమధ్య, నర్సింగపురం, మందస, హెరీన్నాళి తదితర గ్రామాల్లో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పలాసలోని టిడిపి కార్యాలయంలో గౌతు శిరీషతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేశారని ఆరోపించారు. ఏటా (మిగతా...2లో)

7న జిల్లాకు రాజ్‌నాథ్‌సింగ్ రాక

ఎచ్చెర్లలో బహిరంగ సభకు హాజరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈనెల ఏడో తేదీన జిల్లాకు రానున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఎన్‌డిఎ కూటమి తరుపున బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నడుకుదిటి ఈశ్వరరావుకు మద్దతుగా ఆయన ప్రచారం చేయనున్నారు. ఆరోజు 11.50 (మిగతా...2లో)

ఓటు హక్కు వినియోగంపై చైతన్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటర్లందరూ ఎన్నికల్లో తప్పక తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో లయన్స్ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యాన ముద్రించిన బ్రోచర్లు, గ్లో సైన్ బోర్డులను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఓటరు బాధ్యతగా వినియోగించుకోవాలన్నారు.

ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో అవసరమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండేందుకు పెద్దఎత్తున ఓటర్ల నమోదు చేపట్టినట్లు తెలిపారు. మనల్ని పాలించే ప్రజాప్రతినిధులను (మిగతా...2లో)

విశాఖ రాజధాని ఖాయం

రెవెన్యూ మంత్రి ధర్మాన

మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈ ఎన్నికల్లో మళ్లీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఇక విశాఖపట్నం రాజధాని కావడం ఖాయమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని పలు వార్డుల్లో శనివారం ఎన్నికల ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాగైనా అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు దొంగ మేనిఫెస్టోను తయారు చేశారని విమర్శించారు. ఏవేవో పథకాలు ఇస్తానని చెప్తున్నారని, ఆయన సిఎంగా ఉన్నప్పుడు వాటిని (మిగతా...2లో)

రాజకీయ చదరంగంలో...

పండుటాకులే పావులు

శ్రీకాకుళం నగరంలోని ఎపిజివిబి వద్ద పెన్షన్ కోసం బారులు తీరిన వృద్ధులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాజకీయ పార్టీల చదరంగంలో పండుటాకులు పావులుగా మారారు. అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్ష టిడిపి రెండూ ఎత్తుకు పైఎత్తులు వేస్తూ పింఛన్‌దారులను అవస్థలపాల్జేశారు. పింఛన్ పంపిణీలో లబ్ధిదారుల అవస్థలకు మీరంటే మీరే కారణమంటూ ఒకరినొకరు నిందించుకోవడం మనం చూస్తున్నాం. ఎన్నికల వేళ ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేస్తే, అది వైసిపికి లాభిస్తుందని భావించిన టిడిపి ఆ ప్రక్రియను అడ్డుకుంది. తన ప్రయోజనాలకు గండి కొట్టిన టిడిపిని దోషిగా చూపించాలని భావించిన ప్రభుత్వం, నడవలేని వారిని సైతం బ్యాంకులకు రప్పించి నరకం చూపించింది. పింఛన్ల పంపిణీ విషయంలో రెండు నెలలుగా ఇదే తంతు కొనసాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ములు పంచితే వారు వైసిపికి ఓటేయాలని చెప్తున్నారని అంచనా వేసిన టిడిపి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. స్పందించిన ఇసి పింఛన్ల పంపిణీకి వాలంటీర్లను వినియోగించొద్దని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ద్వారా ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం విదితమే. టిడిపి ఫిర్యాదుపై రగిలి పోయిన వైసిపి దానికి విరుగుడు సూత్రాన్ని అమలు చేసింది. పింఛన్‌దారులను ఏకంగా సచివాలయాలకు రప్పించింది. దీంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నడవలేని వారు తమ బంధువులు, వీధిలో తెలిసిన వారిని బతిమిలాడి వారి సాయంతో సచివాలయాలకు వెళ్లి డబ్బులు అందుకున్నారు.

(మిగతా...2లో)

మొదటి పేజీ తరువాయి

7న జిల్లాకు రాజ్‌నాథ్‌సింగ్ రాక

గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టరులో బయలుదేరి 12.10 గంటలకు ఎచ్చెర్ల హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.20 గంటల నుంచి 1.10 వరకు ఎచ్చెర్లలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. 1.20 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుని 1.40 గంటలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్తారు.

పండుటాకులే పావులు

సచివాలయాల్లో కనీసం నీడ, నీటి సౌకర్యం లేక వృద్ధులు చాలా అవస్థలు పడ్డారు. ఇంటింటికీ పింఛన్ అందించే వెసులుబాటు ఉన్నా, ప్రభుత్వం కావాలనే చేసిందని టిడిపి విమర్శల దాడి చేసింది. పింఛన్ల అందజేతకు సచివాలయ సిబ్బంది ఉన్నా పింఛన్‌దారులను కావాలనే ఇబ్బందిపాల్జేసిందని టిడిపి ఆరోపించింది.

మేలో పింఛన్లు ఎలా ఇస్తారో, ఎన్ని పాట్లు పెడతారో అని ఏప్రిల్ నెలాఖరులోనే వృద్ధుల్లో ఆందోళన మొదలైంది. మళ్లీ రెండు పార్టీలు డ్రామాలు మొదలుపెట్టాయి. పింఛన్లను ఇంటింటికీ వెళ్లి అందించాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్ మూడో వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి లేఖ రాశారు. దీనిపై ప్రభుత్వం మరో విరుగుడు మంత్రాన్ని అమలు చేసింది. పింఛన్ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తామంటూ పింఛన్ల పంపిణీకి ముందు రెండు రోజులు ప్రకటించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయమే పండుటాకులకు ప్రత్యక్ష నరకం చూపింది. మండుటెండలోనే ఉసూరుమంటూ బ్యాంకులకు వెళ్లారు. అక్కడ మరిన్ని అవస్థలకు గురయ్యారు. కూర్చోవడానికి నిలువ నీడ లేక, గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని ఇబ్బందులు పడ్డారు. పోనీ డబ్బులు చేతికిచ్చారంటే అదీ సక్రమంగా జరగలేదు. చాలామందికి బ్యాంకు ఖాతాల్లేక డబ్బులు జమ కాలేదు. ఖాతాల్లో నగదు లావాదేవీలు చాలాకాలంగా ఆపేయడంతో ఖాతాలు పనిచేయడం లేదు. సందిట్లో సడేమియా అన్నట్లు బ్యాంకర్లు ఇదే అదనుగా కస్టమర్ ఛార్జీలను మినహాయించుకుని లబ్ధిదారులకు సొమ్ములు ఇచ్చారు. వచ్చే నెల కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో, ఇవే పాట్లు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. లబ్ధిదారులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రభుత్వం, ఎన్నికల సంఘం పింఛన్ పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

పింఛన్‌దారుల ఓట్లపై దృష్టిపెట్టిన టిడిపి మరో హామీకి తెర తీసింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల్లో 50 ఏళ్లు దాటిన వారికి సామాజిక పింఛన్ అందిస్తామంటూ తన మేనిఫెస్టోలో పెట్టింది. ఎన్నికల ప్రచారం కోసం పలాస, పాతపట్నం, ఆమదాలవలస ప్రాంతాలకు వచ్చిన చంద్రబాబు, కేవలం బిసిలకే ఇస్తామని ప్రకటించారు. బిసిలకు అంటే ఎస్‌సి, ఎస్‌టిలు దూరమవుతారని అంచనా వేసిన అధినేత, మేనిఫెస్టోలో మాత్రం ఆ రెండు సామాజిక తరగతులనూ చేర్చారు. ఇతర సామాజిక తరగతులను విస్మరించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. వృద్ధాప్యంలో ఏ ఆధారం లేని నిరుపేదలకు అందించే పింఛన్ల విషయంలోనూ వయసు మినహాయింపులేమిటని అంతా ప్రశ్నిస్తున్నారు. 50 ఏళ్లకే పింఛను విషయంలో చంద్రబాబుకు ఓట్ల మీద దృష్టి తప్ప పింఛన్‌దారులపై ప్రేమతో కాదనే చర్చ నడుస్తోంది.

ఎచ్చెర్ల : ఓటు వేసేందుకు బారులు తీరిన ఉద్యోగులు

పోస్టల్ బ్యాలెట్ ప్రశాంతం

ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పరిశీలించారు. టెక్కలిలో ఫెసిలిటేషన్ సెంటర్‌లోని నాలుగు కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. ఓటింగ్ కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ ఆధికారి నూరుల్ కమర్‌తో పాటు ఎన్నికల పరిశీలకులు సందీప్‌కుమార్‌లు పరిశీలించారు. ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎండ వేడిమితో వాతావరణం ఉక్కపోతగా ఉన్నప్పటికీ ఉద్యోగులు ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటింగ్ కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ టెక్కలి అభ్యర్థి కిల్లి కృపారాణి, టిడిపి అభ్యర్థి కింజరాపు ఆచ్చెన్నాయుడు తరుపున ఆతని సోదరుడు హరివరప్రసాద్ సందర్శించారు. నరసన్నపేట జూనియర్ కళాశాలలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్, టిడిపి అభ్యర్థి బగ్గు రమణమూర్తి పరిశీలించారు. ఇచ్ఛాపురంలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ క్వార్టర్స్‌లో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఉపాధికల్పన అధికారి సుధ, లావేరు తహశీల్దార్ లక్ష్మి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

స్వప్రయోజనాల కోసం రాష్ట్రం తాకట్టు

జనసేన... తొత్తుగా మారిన వైసిపిలను ఈ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. స్థానిక ఒక కళ్యాణ మండపంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వనరులున్నా, వాటిని సద్వినియోగం చేసుకోవడంలో పాలకులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు తప్ప కొత్త ప్రాజెక్టులు ఏమీ లేవన్నారు. వైసిపి, టిడిపి ప్రజా సమస్యలను గాలికొదిలేసి, రాజకీయ ప్రయోజనాలు, సొంత అజెండాలతో ముందుకు సాగడంతో జిల్లా అభివృద్ధి దశాబ్దాలు వెనక్కి వెళ్లిపోయిందని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు ఒడిశాతో వివాదంలో ఉన్న వంశధార ప్రాజెక్టు సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. పదేళ్లపాటు ఎంపీగా ఉన్న రామ్మోహన్ నాయుడు జిల్లాకు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 36 రైళ్లు ఆగకుండా వెళ్లిపోతున్నాయని, ఒక్క రైలు అయినా నిలుపుదలకు కృషి చేయలేకపోయారని చెప్పారు. అయ్యప్ప భక్తుల కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైలు వేస్తే, తన కృషితోనే వేయించినట్లు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. నౌపడ – రాయగడ మధ్య బ్రాడ్ గేజ్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. జిల్లాల పునర్విభజనతో జిల్లాకు ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనులు ఎంతో నష్టపోయారని, జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామన్నారు. టెక్కలిలో ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, శివారు భూములకు సాగునీరందిస్తామని హామీనిచ్చారు. పార్లమెంటు సభ్యునిగా తనను, ఆమదాలవలస అసెంబ్లీ అభ్యర్థిగా సనపల అన్నాజీరావును గెలిపించాలని కోరారు. తాము గెలిస్తే నెరవేర్చే 15 హామీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సనపల అన్నాజీరావు, సిపిఎం నాయకులు కె.నాగమణి, కాంగ్రెస్ నాయకులు బొత్స రమణమూర్తి, లఖినేని నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఓటు హక్కు వినియోగంపై చైతన్యం

ఎన్నుకునే అద్భుత అవకాశం ఓటు హక్కుతోనే లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, నోడల్ ఆఫీసర్ కిరణ్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, జోన్ చైర్మన్ బాడాన దేవభూషణరావు, కార్యదర్శి టెక్కం రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలి

జాబ్ కేలండర్ ప్రకటిస్తామని చెప్పి చివరకు నిరుద్యోగులను నిలువునా ముంచారని ధ్వజమెత్తారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్న దయనీయ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఒక్క కొత్త పరిశ్రమ నెలకొల్పలేదు సరికదా ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోయేలా చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు అని, ఆయన సిఎం అయితే పరిశ్రమలు వచ్చి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఇప్పుడు అందరూ చంద్రబాబు వైపు చూస్తున్నారని చెప్పారు. ఓటు హక్కుతో జగన్‌ను గద్దె దించి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నారు.

టిడిపి అభ్యర్థి గౌతు శిరీష మాట్లాడుతూ జగన్ పాలనలో సినీ పరిశ్రమనూ విడిచిపెట్టలేదన్నారు. ఏ సినిమా టిక్కెట్లు ఎంత రేటుకు అమ్మాలో ఆయనే నిర్ణయించారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే దామోదరసాగర్, కళింగదళ్ ప్రాజెక్టుల ఆధునీకరణ చేపట్టి పంట భూములకు సాగునీరందేలా చేస్తానని హామీనిచ్చారు. జీడి రైతులను ఆదుకుంటామని, జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల మధ్య జీడి బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు. జీడి అనుసంధాన పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సంతోష్‌కుమార్ పండా, టిడిపి నాయకులు రట్టి లింగరాజు, దాసరి తాతారావు, జి.కె నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రాజధాని ఖాయం

ఎవరు ఇవ్వవద్దని అన్నారని ప్రశ్నించారు. ఇప్పుడే ఎందుకు జ్ఞాపకం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల కోస సంక్షేమ పథకాలను రూపకల్పన చేసి అమలు చేస్తున్నప్పుడు దండగ అన్న చంద్రబాబు, ఈ రోజు ఆయన అవే పథకాలను ప్రకటించి పండగ అంటున్నారని ఎద్దేవా చేశారు. ఆయన ఎన్ని చెప్తున్నా, ప్రజలు వాటిని విశ్వసించడం లేదన్నారు. కూటమి మేనిఫెస్టోకు బిజెపి హామీదారుగా లేదని, ఆ మేనిఫెస్టోను చదవడం కాదు కదా ముట్టుకునేందుకూ ఇష్టపడనప్పుడు ఆ హామీలకు గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి నీతి, నిజాయితీ ప్రజలకు తెలుసునని, ఒక్కసారి మాట ఇచ్చారంటే తప్పరని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాలను అందజేశారని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. అవన్నీ చంద్రబాబు సృష్టిస్తున్న అపోహలని చెప్పారు. జగన్ ప్రభుత్వం ప్రజలకు భూములు పంచేదే గానీ ప్రజల నుంచి లాక్కొనేది కాదన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే చంద్రబాబు, పవన్ ఇటువంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. శ్రీకాకుళం నగరంలో అనేక అభివృద్ధి కారక్రమాలను చేపట్టామని, చేయాల్సినవి ఇంకా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చెర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
O.S.No.537/2022

Between:-
Annepu Vinodkumar ...Plaintiff.
And:-
Cheedi Veerabhadrarao ...Defendant

To,
Cheedi Veerabhadrarao, S/o Venkata Narayana,Hindu, Senior Assistant Sub collector office, Tekkali, Srikakulam district.

Please take this notice in the above matter that the above matter is posted to 07-05-2024 for your appearance. You are here by directed to appear before the above court at **10-30 A.M. on 07-05-2024** in person or thorough advocate with out fail. Other wise the matter will be decided in your absence.

// By court order //

RAVI SASTRY ARASADA
ADVOCATE,
SRIKAKULAM, CELL:7396162777

మహారాజు శ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
HMOP. 2/2024

పిటిషనర్:–
ముప్పన దుర్గా ప్రసాద్
రెస్పాండెంట్:–
ముప్పన@చప్పటి అనూరాధ
To,
ముప్పన@ చప్పటి అనూరాధ,
W/o ముప్పన దుర్గా ప్రసాద్, D/o చప్పటి డిల్లేశ్వరరావు, R/at D.No: 7–6–106, కర్ర వీది, శ్రీకాకుళం టౌన్&జిల్లా.

పై నెంబర్ పిటిషనర్ మీతో విడాకులు కోరుచూ U/Sec13(1)(i) of Hindu Marriage Act ప్రకారం పై నెంబరు పిటిషన్ దాఖలు చేసినందున అందుకు మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడలా **తే॥ 26–06–2024 ది॥న ఉదయం గం॥ 10:30గం॥లకు** మీరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకోగలరు. లేని ఎడల మీ పరోక్షం అందు తీర్మాణిచండం జరుగనని తెలియజేయడమైనది.

కె. రమణ మూర్తి
బి. మంజుల
న్యాయవాదులు,
రాజాం.

రాజాం,
తేది: 05–05–2024

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.P. No. 20/2023

Between:-
Kurmana Eswara Rao ...Petitioner
And:
Tumula Suresh And 11 Others ...Respondents

To,
R-1. Tumula Suresh, S/o Vagra Raju aged 42 years, Hindu, Business, residing at Hudco Colony, Srikakulam - 532001 Andhra Pradesh
R-2. Kosuru Bheemeswara Rao, S/o, Srinuvasarao, Chinna Bazar, Near Neelamma Temple, Srikakulam 532 001 Andhra Pradesh.
R-3. Irrothu Venkateswara Rao, S/o Sai, R/o Sai Krupa Residence, Behind Rythu Bazar, Srikakulam - 532 001, Andhra Pradesh.
R-4. Korada Vasantha Rao, S/o Srinivas, R/o Opp. Petrol Bunk, Rythu Bazar, Illisipuram, Srikakulam - 532 001 Andhra Pradesh.
R-5. Komara Appa Rao, S/o Masenu, R/o Beside Muddada Chinna babu Hospital, Sana Veedhi, Srikakulam - 532 001 Andhra Pradesh.
R-6. M.Govinda Rao, S/o Ramulu, Mutchavani peta, Behind KIMS Hospital, Srikakulam 532 001 Andhra Pradesh.
R-7. Konala Ammireddy, S/o adinarayana, R/o Tilak Nagar, Srikakulam - 532 001 Andhra Pradesh.
R-8. Mudda Babu Rao, S/o laxmana Rao, Tangivanipeta, Srikakulam Rural 532 001 Andhra Pradesh.
R-9. Gorentla Appala Raju, S/o Raju, R/o Peddapadu, Srikakulam Rural 532 001 Andhra Pradesh.
R-10. Patnana Srinivasa Rao, S/o Ramulu, R/o Kattiri Veedhi, Near Rajarajeswari Petam, Srikakulam - 532 001 Andhra Pradesh.
R-11. Kurmana Govinda Rajulu, S/o late Koteswara Rao, R/o Muncipal Elemantry School, Punyapuveedhi, Srikakulam - 532 001 Andhra Pradesh.
R-12. Kurmana Narayana, S/o late Koteswara Rao, R/o Muncipal Elemantry School, Punyapuveedhi, Srikakulam - 532 001 Andhra Pradesh.

Take Notice that the insolvency petition filed by the above named petitioner is posted for hearing at **10.30 AM.,** on **08-05-2024** before the Honourable Senior Civil Judge Court, Srikakulam, and if you wasn't in person or by a duly instructed pleader and if you fail to show cause matter will be decided in your absence and expert.

RAVI SASTRY ARASADA
ADVOCATE,
SRIKAKULAM,
Cell: 9515777773,7396162777.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

పాతపట్నం : పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- పాతపట్నం

ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. శనివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలకు సంబంధించి పాతపట్నం ఎపి మోడల్ స్కూల్లో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు మండల రిటర్నింగ్ అధికారి, తహశీల్దార్, అధికారులు ఉన్నారు.

ఆమదాలవలస: నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను శనివారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో ప్రారంభించారు ఈ ఓటింగ్‌లో పలువురు ఉద్యోగులు పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించు కున్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల వద్ద ప్రధాన పార్టీ అభ్యర్థులకు చెందిన ప్రతినిధులు కళాశాల ఆవరణలో ఉండడం గమనార్హం. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 988 ఓట్లు పోలయ్యాయి. రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఎన్నికల బ్యాలెట్ పత్రాలను భద్రపరిచారు.

ఎచ్చెర్ల: ఎచ్చర్ల నియోజకవర్గం పరిధిలో ఎచ్చెర్ల, జి.సిగడాం, రణస్థలం, లావేరు మండలాల నుంచి ఎన్నికల విధులకు హాజరవుతున్న ప్రభుత్వ ఉద్యోగులు కోసం ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెటింగ్ ఓట్లు ప్రక్రియ శనివారం ప్రారంభించారు. ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహించారు. ఈ పోలింగ్ ప్రక్రియ ఈ నెల 7 వరకు కొనసాగుతుంది. నియోజక వర్గంలో మొత్తం 3,260 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులుగా గుర్తించారు. మొదటి రోజు పిఒ, ఎపిఒ స్థాయి వారికి నిర్వహించగా 1970 మంది ఉండగా 630 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అయితే పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉన్న ప్రతి ఒక్కరికి అనుమతిస్తున్నారు. 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఓటుహక్కు వినియోగించ కోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేశారు. గతంలో పోస్టల్ బ్యాలెట్లు లేకపోవడం వంటి సమస్యలు వలన ప్రత్యేక దృష్టి పెట్టారు. పక్కాగా ప్రతి ఓటు చెల్లుబాటు అయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. క్యూలో నిల్చొని ఉత్సాహంగా ఉద్యోగులు ఓటు హక్కుని వినియోగించు కున్నారు. జిల్లా ఉపాధి అధికారి సుధ, లావేరు తహశీల్దార్ లక్ష్మి ఎన్నికల ప్రక్రియ పర్య వేక్షించారు. పోలీసులు శాంతిభద్రతలు పర్యవేక్షించారు.

టెక్కలి: వచ్చే సార్వత్రి ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు కేటాయించే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సజావుగా ప్రారంభమైంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ ఆధికారి నూరుల్‌కమర్, ఎన్నికల పరిశీలకులు సందీప్‌కుమార్‌లు పరిశీలించారు. ఓటింగ్ జరుగుతున్న విధానంపై ప్రత్యేక శ్రద్ధ చూపి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటింగ్ కోసం నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు.అదేవిధంగా టిడిపి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు తరుపున ఆయన సోదరుడు కింజరాపు హరి వరప్రసాద్ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ని పర్యవేక్షించారు. పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పోస్టల్ ఓటింగ్ ప్రక్రియని పరిశీలించారు.

నరసన్నపేట: నరసన్నపేట జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా ప్రారంభమైంది. పోలాకి, నరసన్నపేట, సారవకోట, జలుమూరు మండలాల్లోని విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, ఉద్యోగులు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రాన్ని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి పరిశీలించారు. సిఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యాన పటిష్టంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు.

ఇచ్ఛాపురం : మూడు రోజుల పాటు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తొలి రోజు శనివారం స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పోలింగ్ కేంద్రం పరిధిలోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. తొలి రోజు 642 ఓట్లు పోలయ్యాయి. ఇందులో ఇచ్ఛాపురం 132, కవిటి 138, కంచిలి 95, సోంపేట 277 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రం వద్ద సిఐ టి.ఇమ్మాన్యుల్‌రాజు ఆధ్వర్యాన పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు, కవిటి ఎస్ఐ రాములు పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొదటి రోజు 756 ఓట్లు పోల్

పలాస : పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో మొదటిరోజు 756 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి ఎం.సురేష్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తును పోలీసులు నిర్వహించారు. మొదటిరోజు పోలైన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో సీల్ చేసి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో అధికార, ప్రతిపక్ష పార్టీలతో పాటు, స్వతంత్ర అభ్యర్థులు శిబిరాలను ఏర్పాటు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

లక్ష్మీనారాయణ (ఫైల్)

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పాలవలస సమీపంలో శనివారం గుర్తు తెలియని రైలు ఢీకొని గ్రామానికి చెందిన దున్న లక్ష్మీనారాయణ (62) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... లక్ష్మీనారాయణ తన పొలానికి వెళ్లేందుకు రైలును గమనించకుండా ట్రాక్ దాటుతున్నాడు. ఈ సమయంలో ట్రైన్ వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య శేషమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె జ్ఞానేశ్వర్‌కి వివాహం కాగా, కుమారుడు కిషోర్ బయట రాష్ట్రంలో పనిచేస్తున్నాడు. సంఘటనపై రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇఒపై ఫిర్యాదు

కోటబొమ్మాళి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న బామిని భవాని పంచాయతీ ఇఒ చింతాడ సన్యాసిరావుపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంత కాలం నుంచి తనపై అసభ్యకరంగా ఇఒ ప్రవర్తిస్తున్నాడని ఆ ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. అసభ్య పదజాల మాటలు అడేవాడని, పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 28న ఉదయం 10 గంటలకు ఆయన గదిలోంచి కబురు పెట్టగా, ఆయన గదిలోకి వెళ్లానని అన్నారు. తాను చెప్పినట్లు చేయాలని కోరగా, తాను నిరాకరించానని అన్నారు. దీంతో ఆయన తన ఉద్యోగం కూడా తీయిస్తానంటూ బెదిరింపులకు దిగాడని అన్నారు. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్

ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పురుషోత్తపురం జాతీయ రహదారి వద్ద ఉన్న సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్ శనివారం వాహనాలను ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎన్నికలు నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్, బెల్లుపడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రానైట్ సంస్థ ఔదార్యం

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని రావివలస వద్ద ఉన్న స్టోన్‌ఫ్లెక్స్ గ్రానైట్స్ యాజమాన్యం తన ఔదార్యాన్ని చాటుకుంది. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మైదానానికి స్వచ్ఛందంగా చదును చేసేందుకు అంగీకారాన్ని తెలియజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.భారతి శనివారం తెలిపారు. పాఠశాల మైదానం గోతులమయంగా మారింది. దీంతో విద్యార్థుల క్రీడలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాఠశాల ఉపాధ్యాయులు సమీపంలోని స్టోన్‌ఫ్లెక్స్ గ్రానైట్స్ సంస్థ యజమాని కృష్ణను సంప్రదించారు. దీంతో ఆయన స్పందించి పాఠశాల మైదానం చదును చేసి, గోతులను కప్పించారు. ఈ పనులను ఉపాధ్యాయులు మార్పు నారాయణమూర్తి, ధర్మారావు, దాసరి రామారావు, జనార్ధన, తిరుపతి, సింహాచలం పరిశీలించారు.

పనులు చేపడుతున్న యాజమాన్యం

వైసిపి కండువా వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వైపిపిలోకి వంద కుటుంబాలు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని నెరడి పంచాయతీ జోగిపాడు, ఉప్పరపేట, ఆకులతంపర పంచాయతీల నుంచి టిడిపి నుంచి వైసిపిలోకి వంద కుటుంబాలు చేరాయి. వీరికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఆకర్షించి వైసిపిలో చేరుతున్నారని అన్నారు. వైసిపి విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈమెతో పాటు పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్య నారాయణ, సర్పంచ్‌లు పి.సాధుబాబు, వై.ధర్మారావులు ఉన్నారు.

కృష్ణదాస్ ప్రచారం

పోలాకి : మండలంలోని కుసుమ, పోలవలస, చీడివలసల పంచాయతీల్లో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. బిసి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ ధర్మాన కృష్ణదాస్, ఎంపిపి ముద్దాడ బైరాగినాయుడు, వైస్ ఎంపిపి అప్పారావు, కలగదండు తాతారావు పాల్గొన్నారు.

దళిత ద్రోహులను ఓడించాలి

టెక్కలి: రాష్ట్రంలో ఈ ఐదేళ్ల దళితులు ఎన్నో రకాలుగా అవమానాలకు గురయ్యారని, దళితులపై, ఆదివాసీలపై దాడులకు పాల్పడి అక్రమంగా అరెస్టులు చేసిన వైసిపి ప్రభుత్వం దళిత ద్రోహి అని, అటువంటి పార్టీని ఓడించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు పిలుపునిచ్చారు. బిఎస్‌పి టెక్కలి నియోజకవర్గ అభ్యర్థి చింతాడ శ్రీనివాసులుతో కలిసి రావివలస, తెలినీలాపురం, మునసబుపేట, కోదండపురం గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఆక్రమణలపై సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి- పలాస

గత కొన్నాళ్లుగా పలాస మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూముల కబ్జాల కోసం రెవెన్యూ అధికారులను అడుగుతున్నామని, అధికారులు అరకొరగా సమాచారం ఇస్తున్నారని వైద్యులు, సామాజిక కార్యకర్త డాక్టర్ జీవితేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ అధికారులకు భూ కబ్జాలు నియంత్రించమని, కబ్జాల ఉన్న ఆస్తులు ప్రభుత్వపరం చేయమని కోరుతున్నానని అన్నారు. ఈ క్రమంలో స్థానిక ఆర్‌డిఒకు, తహశీల్దార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేశామని అన్నారు. సమాచార చట్ట ప్రకారం కబ్జాకు గురైన ప్రభుత్వ భూము లు, అలాగే ఆక్రమణలకు గురైన భూములను తిరిగి స్వాధీనం ఏమైనా చేసుకున్నారా? అని అడిగానని తెలిపారు.

జీవితేశ్వరరావు

విజయ కుమార్తె ప్రచారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రజారంజకంగా పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన రావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని వైసిపి అభ్యర్థి పిరియా విజయ కుమార్తె పిరియా జాగృతి అన్నారు. మండలంలోని తులసిగాం పంచాయతీలో శనివారం ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారా య ణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆసి పురు షోత్తం, సర్పంచ్ ఆర్.పార్వతి పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న జాగృతి

'శ్రీశయన'లను వైసిపి విస్మరించింది

పలాస: రాష్ట్రంలో శ్రీశయనలు ఐదు లక్షలకు పైబడి ఉన్నారని, వారిని వైసిపి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించలేదని అఖిల భారత గౌడ సంఘం కన్వీనరు కొళ్ల ఈశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం శ్రీశయనలను గుర్తించి సుస్థిరస్థానాన్ని కల్పించిందన్నారు. పలాస నియోజకవర్గంలో గౌతు శిరీషకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి గౌరవించిందన్నారు. అందుకు టిడిపికి మద్దతు పలుకుతున్నామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు చింతపల్లి కనకారావు, వి.నాగరాజు, బి.అప్పారావు, కె.బాలరాం, వి.మహాలక్ష్మి, ఆర్.రాంబాబు, ఎల్.వెంకటరమణ, మన్మధరావు, డి.జ్యోతిభాస్కరరావు, వి.రామరాజు, బి.సూర్యకృష్ణంరాజు, ఆర్.దానయ్య, బి.డిల్లేశ్వరరావులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలు బూటకం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోపై ప్రజలకు విశ్వాసం లేదని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు అన్నారు. మండలంలోని కస్తూరిపాడు, గంగుపేట, కొబ్బరిచెట్లుపేట గ్రామాల్లో వైసిపి నాయకులతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. వైసిపి వస్తేనే ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయన్నారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మరన్నారు. కార్యక్రమంలో అన్నెపు రామారావు, బొడ్డు అప్పన్న, సంపతిరావు హేమసుందరరాజు, గురువెల్లి కేశవరావు, ఎంపిటిసి పూజారి సత్యం, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలో సుందరాడ, అప్పోజీపేట గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ జి.ధర్మారావుతో కలిసి అప్పోజీపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. గడిచిన 58 నెలల్లో ప్రజలకు చేకూరిన సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

టిడిపి వల్లే పింఛనుదారులకు కష్టాలు

వృద్ధురాలి కాలు కడుగుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి- నౌపడ

అవ్వాతాతలకు పింఛను కష్టాలు తెచ్చింది టిడిపి నాయకులేని, వారికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. సంతబొమ్మాళి మండలం ఆరికివలస, చెట్లతాండ్ర, దండుగోపాలపురం, కోటపాడు, వడ్డితాండ్ర పంచాయతీ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వం ఇంటింటికీ అందజేస్తున్న లబ్ధిని లబ్ధిదారులకు వివరిస్తూ... ఎన్నికల్లో ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఎప్పటిలాగే సంక్షేమ పథకాలు ఇంటికి రావాలంటే వైసిపి ప్రభుత్వమే కొనసాగాలన్నారు. పార్టీలకతీతంగా పథకాలు అందజేస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కోత సతీష్, పిఎసిఎస్ చైర్మన్ కెళ్లి జగన్నాయకులు, ఎఎంసి చైర్మన్ సుగ్గ పుణ్యవతి, ఎంపిపి మెరుగు రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు పొందెల తులసమ్మ, నక్క చింతామణి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రచార రథంపై ఎంపీ, ఎమ్మెల్యే

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో దాదాపు అన్ని వార్డుల్లో తిరుగుతూ శనివారం చేపట్టిన బైక్ ర్యాలీ విజయవంతమైంది. పురుషోత్తంపురం నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, బిజెపి ఇన్‌ఛార్జి బుద్ధల నిర్మాలారెడ్డిలు ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకెళ్లారు. పురుషోత్తపురం, అమీన్‌సాహెబ్‌పేట, బెల్లుపడ, బెల్లుపడ కాలనీ, రథం వీధి, గొల్లవీధి, వి.కె.పేట, రత్తకన్న ప్రాంతాల్లో బైక్ ర్యాలీ సాగింది. టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు కలిసి బైక్ ర్యాలీ నిర్వహించడంతో కేడర్‌లో జోష్ పెరిగింది. అడుగడుగునా ప్రజల నీరాజనం పువ్వుల వర్షంతో ఎక్కడికక్కడే ఘన స్వాగతం పలికారు. అమీన్‌సాహెబ్‌పేట వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాలీనా ఢిల్లీ, వార్డు కౌన్సిలర్ పత్రీ తవిటయ్య ఎంపీ, ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. కార్యకర్తలు బైక్‌లపై నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

బారువలో...

సోంపేట : రాష్ట్ర ప్రజలంతా టిడిపి వైపే ఉన్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. ఈ మేరకు బారువలో ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. సాయిరాం ఆలయం వద్ద నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పురవీధుల్లో ర్యాలీ సాగింది. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం ముడిపడి ఉన్నాయన్నారు. ముందుగా స్థానిక అభిమానులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.

జగన్ భయంతో విదేశాలకు విజయమ్మ

ప్రచారం చేస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

జగన్మోహన్ రెడ్డి భయంతోనే ఆయన తల్లి విజయమ్మ అమెరికాకు వెళ్లిపోయిందని టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. శనివారం సరుబుజ్జిలి మండలంలోని తెలికిపెంట, మతలబుపేట, చిన్న మతలబుపేట, కాగితాపల్లి, విజయరాంపురం, గోనెపాడు, బప్పడాం, సరుబుజ్జిలి పంచాయతీల్లో సూపర్ సిక్స్‌పై ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు సిఎం కావాలన్న ఆకాంక్షతో సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డిని అతికిరాతకంగా బలి తీసుకుని ఆ హత్యను చంద్రబాబు నాయుడు చేయించారని పత్రికల్లో ప్రచురించి లబ్ధి పొందారన్నారు. నేడు 2024లో కూడా ముఖ్యమంత్రి కావాలన్న ఉద్దేశంతో తనను కూడా చంపేస్తాడు అన్న భయంతో కుమారుడు జగన్‌కు భయపడి విజయమ్మ ఇతర దేశాలకు పారిపోయిందని అన్నారు. అలాగే తన తండ్రి హత్య కేసులో న్యాయం చేయాలని చిన్నాన్న కూతురు సునీత, తన తండ్రి ఆస్తిలో వాటా ఇవ్వాలని వైఎస్ కూతురు షర్మిల ఇద్దరు చెల్లెళ్లు రోడ్డున పడి తీవ్ర విమర్శలు చేస్తున్నప్పటికీ జగన్ నోరు విప్పకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సొంత కుటుంబానికి న్యాయం చేయలేని జగన్ ప్రజలకు ఏమి న్యాయం చేస్తాడని రవికుమార్ ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమం అందించడమే కాకుండా రాష్ట్రాన్ని అన్ని విధాల ఆదుకొని ప్రజలకు భవిష్యత్ ఇవ్వడమే ధ్యేయంగా ఏర్పడిన బిజెపి, టిడిపి, జనసేన కూటమిని ప్రతిఒక్కరూ ఆదరించి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, నందివాడ గోవిందరావు, గురువు తిరుమలరావు, నూక ప్రభాకర్, చిన్నాల అప్పారావు, నూక కోటేశ్వరరావు, సీపాన శ్రీరామచంద్రమూర్తి, కూన గణపతిరావు పాల్గొన్నారు.

ఎలచ్చన్లో ఏటి సేత్తాం?

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో వేసవి వేడితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎలక్షన్ల వేడీ పెరుగుతుంది. ఇటువంటి క్రమంలో ప్రధానమైన పార్టీలైన ఇండియా ఫోరం, టిడిపి, వైసిపి పార్టీలు తమ నూతన మేనిఫెస్టోలతో ఓటర్లను ఆకర్షించే యత్నాలు చేస్తున్నాయి. అమలు సాధన ఎంతవరకు అనే దానిపై చర్చ జరుగుతుంది. పేదలు, సామాన్యుల జీవన విధానక్రమంలో భాగంగా ఈ సంతలో సింతపండు వ్యాఖ్యానం మీ కోసం.

ప్రజాశక్తి- టెక్కలి

కాంత: లచ్చిమెదిన ఈ ఎండల్లో చెరువు పనులు చేయడం శానా కష్టంగా యుందే.

లచ్చి : ఎటి సెత్తామే మన బతుకులే మట్టి బతుకులు. కాస్టంకు ఎల్లినంతవరకు తప్పవే.

కాంత : ఎన్ని పెబుత్వాలు మారినా మన బతుకులు మారలేదే వోదినా.

లచ్చి : ఏమి సేత్తాం మరి మనల్ని పట్టించుకునేవాడే లేడు. అందరికీ అన్నీ ఇచ్చేత్తాన్నాం.. అంటారే కానీ ఏదీ ఉండదు.

కాంత : ఆల మాటలు నమ్మినావంటే అంతే వోదినా ఎలచ్చన్లో సెపుతారు ఏదీ సెయ్యరు.

లచ్చి : ఏ మాటకు అమాటే సెప్పుకోవాలి గానీ ధరలు బాగానే పెరిగినాయి. కానీ, మన కూళ్లు మాత్రం పెరగనేదు. ధరలు పెరిగినాయి. ఏమి అని అడిగితే పెబుత్వాలు పెంచేత్తున్నారు అంటారు.

కాంత : అన్ని పెబుత్వాలు సంక్షేమం, పథకాలంటున్నా మన పేదరికం మాత్రం మారడం నేదు.

లచ్చి : ఏమి పథకాలోదినా పథకాలంటూనే ఈత కాయ ఇచ్చి.. తాటికాయలు తీసేసుకుంటున్నారు కదా.

కాంత : అవును మరి పన్నులు ఏత్తన్నారు. ధరలు కూడా ఇపరితంగా పెరిగినాయి. గ్యాస్ వెయ్యి రూపాయలు, పప్పులు, ఉప్పులు అన్నీ పెరిగిపోనాయి. ఓలమ్మ సెప్పకేమీ కరెంట్ బిల్లు సూస్తే గుండె జారిపోతున్నాది.

లచ్చి : మరే... అన్ని ధరలూ పెరిగిపోనాయి. ఏమంటే సంక్షేమ పథకాలంటున్నారు.

కాంత : ఏమి సంక్షేమమే వొదినా అభివృద్ధి ఏమీ నేదు, ఉజ్జోగాలు, ఉపాధి ఏమీ నేదు. పంటలకు నీరు కూడా నేదు.

లచ్చి : ఏటి కొనుకోళ్లు లేము సరికదా కనీసం సిన్న ఇళ్లు అయినా కట్టుకునే స్థితిలో లేము. సిమెంట్, ఇనుము, ఇసుక అన్ని ధరలూ పెరిగిపోనాయి. మీ అన్న ఏమో తెచ్చిన కూలీ డబ్బులు తాగడానికే సాలడం నేదు.

కాంత : ఏమీ మందువొదినా అన్నీ కల్తీయోనట. అది తాగితే జబ్బులోస్తాయట. అవునోదినా చెంద్రబాబునాయుడు కూడా పథకాలు కొత్తవి పెట్టినాడట.

లచ్చి : ఆహా! పెట్టినాడులే గత పెబుత్వం పెట్టినవే పెంచినాడు... అంతే.

కాంత : అదేటి లవన్నీ పెట్టడానికి డబ్బులేవన్నాడు... ఇప్పుడెలా వచ్చేస్తాయేటి.

లచ్చి : అధికారం కావాలంటే ఏదో సెప్పేత్తారు. సేస్తారో లేదో తెనీదు కానీ పెకటించేస్తారంతే.

కాంత : అంతే ఎవల్నీ నమ్మలేం వోదినా మనకి మంచి సేసినోళ్లు ఎవ్వరో సూసుకోని వారికే ఓటెత్తాం వోదినా.

కాంత : ఏమైనా వోదినా మన బతుకులు మార్చేది కాంగెస్ పెబుత్వామని నా నమ్మకం నువ్వు ఎటంటావు.

లచ్చి : అవును మరి! అందుకే గదా మనలాటి బతుకుల్లో సైతన్యం తెచ్చె మన ఎర్రజెండా వాళు కూడా వారికి మద్దత్‌నిచ్చి ఇండియా ఫోరం అని కాంగ్రెసోళ్లతో కలిసినారు.

కాంత : పదొదినా టైం అవుతున్నాది.. మీ అన్నయ్య వచ్చే టైం అయినది. వస్తామరి.

బాబు బూటకపు హామీలు

మంత్రి అప్పలరాజు

ప్రచారం చేస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి- మందస

చంద్రబాబు నాయుడు బూటకపు హామీలను నమ్మొద్దని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన నాయకులు జగన్ అని పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని కొత్తపల్లి, సొండిపూడి, మూలిపాడు, సిద్ధిగాం, హొనాలి, బిలియపటియ, సిరిపురం, పొత్తంగి తదతర గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధి చేశామని అన్నారు. ప్రతీ పంచాయతీలో సచివాలయం, హెల్త్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్ పరిపాలన చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు మరో అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, సర్పంచ్‌లు దల్లి జానకరెడ్డి, సూర్యారావు, దివ్య మురళి, సేనాపతి కిషోర్ పాల్గొన్నారు.

నిధులపై శ్రద్ధ మౌలిక వసతుల్లో లేదు

ప్రచారం చేస్తున్న గొండు స్వాతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధి నిధులపై ఉన్న శ్రద్ధ వసతుల కల్పనపై లేదని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి గొండు స్వాతి ఆరోపించారు. గార మండలం అంపోలు పంచాయతీలో మాజీ సర్పంచ్, మాజీ మండలాధ్యక్షుడు గొండు వెంకట రమణమూర్తి, ఎంపిటిసిలు వెలమల శ్రీనివాసరావు, గుజ్జల హిమగిరి, గొండు అచ్యుత, రుప్ప ముసలి నాయుడు ఆధ్వర్యంలో కోళ్లపేట, లింగాలవలస చెరువు పనులను నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సతీమణి స్వాతి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధి కూలీలతో మాట్లాడుతూ బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం శ్రీకూర్మం పంచాయతీ రాళ్లపేట, చింతవలసలో గోర సురేష్ ఆధ్వర్యాన ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు, ఉమ్మడి మేనిఫెస్టోలో పొందు పర్చిన అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బూసి రమేష్, గొలివి భాస్కరరావు, యాళ్ల నాగరాజు, కుప్పిలి భాస్కరరావు, గొండు అప్పలరాజు, బోర శ్రీనివాస్, ఊట నాగరాజు మైలపల్లి అప్పారావు, గొలివి రాంబాబు, చీడి బాలు, కెల్ల ధర్మారావు పాల్గొన్నారు.

నాటి ఎమ్మెల్యే చౌదరి సత్యనారాయణ

నిరాడంబరుడు

సైకిల్‌పై ప్రయాణం చేస్తున్న చౌదరి సత్యనారాయణ (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అభ్యుదయ భావాలు.. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం నాటి పాలకుల్లో కనిపించేది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రజలుపడ్డ కష్టాలను అధిగమించి స్వాతంత్ర్య అనంతరం నాయకులుగా పనిచేసిన వారు ఎందరో మహానుబావులు. సామ్యవాద భావజాలాన్ని అందిపుచ్చుకొని పాలకులుగా ఎదిగినా వారి జీవనశైలి మాత్రం నిరాడంబరంగానే సాగేది. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సైకిల్‌పైనే ప్రయాణం చేస్తూ సేవలందించిన పాలకుల్లో చౌదరి సత్యనారాయణ ఒకరు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి 1967లో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించి చట్టసభలో అడుగుపెట్టారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనా ఆయన ఏనాడూ తన నిరాడంబర జీవనశైలిని మార్చుకోలేదు. ఎమ్మెల్యేగా పదవిలో ఉన్నప్పుడు సైకిల్‌పైనే ప్రయాణం చేస్తూ ప్రజల మధ్య తిరిగేవారు. అప్పుడే ప్రజలు తన జీవితానికి దగ్గరగా ఉంటారని భావించిన సత్యనారాయణ నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలో ఎన్నో ప్రజాసమస్యలను కదిలించి వాటికి పరిష్కారం చూపారు. రైతులకు నిరంతరం సాగు నీటిని అందించాలనే తపనతోనే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేవారు. నాటి ప్రభుత్వాలతో ఘర్షణ వాతావరణం ఉండినా వ్యక్తిగత స్వార్థాన్ని మరచి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేశారు. ఇనాం చట్టాల రద్దు, వంశధార, నాగావళి నదీజలాలను సాగుకు మళ్లించేందుకు చేసిన కృషి ఫలితమే నేటి నారాయణపురం ఆనకట్ట. వంశధార నదిపై గొట్టాబ్యారేజీ నిర్మాణం వంటి వాటి సాధన ఆయన కృషి ఫలితమే. ప్రజలు ఎన్నుకున్న తర్వాత వారి సమస్యలు మరచి వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత నిస్తున్న నేటి పాలకులకు వారి జీవితం కనువిప్పు కావాలి.

బైండోవర్ అంటే తెలుసా?

శ్రీకాకుళం : సాధారణంగా ఎన్నికల సమయంలో ఎక్కువగా బైండోవర్ పదం వినిపిస్తుంది. పాత నేరస్థులు, రౌడీషీటర్లను బైండోవర్ చేస్తారు. ఒక వ్యక్తి వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, ఆయన చర్యలు అనుమానాస్పదంగా ఉన్నా.. ఆ వ్యక్తిని పోలీసులు తహశీల్దార్, ఆర్‌డిఒ ఎదుట హాజరుపరుస్తారు. బాండ్ పేపర్‌పై ఆ వ్యక్తితో చట్ట వ్యతిరేక పనులు చర్యలు చేపట్టబోమని లిఖిత పూర్వకంగా హామీ తీసుకొని సొంతపూచి కత్తుపై విడుదల చేస్తారు. బైండోవర్ బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్ అంటారు. బైండోవర్ అయిన వ్యక్తి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే 24 గంటల్లో అరెస్ట్ చేసి కేసు నమోదు చేస్తారు. బైండోవర్ సమయంలో వ్యక్తులు రాసిచ్చిన పత్రాలు ఆర్నెళ్లపాటు పోలీసులు వద్ద ఉంటాయి.

ఎన్నికల పదనిసలు

కవిటి : డాన్స్ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

మెళియాపుట్టి : ఉపాధి కూలీలతో కలిసి పారతో మట్టి తీస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కూటి కోసం కోటి పాట్లు అని మన పెద్దల సామెత. కానీ నేడు ఓటు కోసం కోటి ఫీట్లు అన్నట్టు మన అభ్యర్థుల ప్రచారం సాగుతోంది. ఆడుతున్నారు... పాడుతున్నారు... మినప అట్లు, మహిళలకు గాజులు వేయడం, ఉపాధి హామీ పనిలో పారతో మట్టితీయడం వంటి చేస్తున్నారు. నలుగురు ఉన్నారంటే చాలు అక్కడకు వెళ్లి వారు చేస్తున్న పనిలో తామూ ఓ చేయి వేసి వారిని ప్రసన్నం చేసుకునేందుకు వారితో మాట కలుపుతున్నారు. ఇన్ని రోజులు అధినాయకుల దర్శనం కోసం ఎదురు చూసిన సామాన్యుడి కాళ్ల దగ్గరకే ఆ నాయకులు వస్తుంటే ఓటరన్న ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు. మీరూ ఓసారి ఆ సిత్తరాలు చూసేయండి. - ప్రజాశక్తి, కవిటి, శ్రీకాకుళం అర్బన్, మెళియాపుట్టి

కవిటి : గాజులు వేసుకుంటున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ

శ్రీకాకుళం అర్బన్ : దోసె వేస్తున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్

ప్రచారాలపై ఎండ ప్రభావం

ప్రజాశక్తి- పలాస

గతకొంత కాలంగా రోజులుగా భానుడు ఉగ్రరూపం దాల్చాడంతో ప్రధాన అధికార, ప్రతిపక్ష నాయకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో, మరోవైపు ఎన్నికలు దగ్గర పడడంతో రాజకీయ నాయకులకు ఏమి చేయాలో తోచడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక ఉష్ణోగ్రతలు ఎన్నికలపై ప్రభావం చూపే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండలు, వేడి గాలులు వీస్తుండడంతో ప్రచారం చేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు భయపడుతున్నారు. మరో వైపు కార్యకర్తలు కూడా రావడానికి ఆలోచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిలో రాత్రి వరకు ప్రచారం చేస్తూ గెలుపు కోసం విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పలాస నియోజకవర్గంలో 50 శాతమే ప్రచారం పూర్తవుతుంది. నియోజకవర్గంలో 2.20 లక్షలు ఓటర్లు ఉన్నారు. పోలింగ్ రోజున అభ్యర్థులు ముందుగా కూలీలు, వృద్ధులు, మధ్య తరగతి ప్రజలు ఓట్లు వేస్తే... రెండో పూట వ్యాపారులు, ఆర్థికంగా బలమైన వారు, విద్యావేత్తలు వచ్చి తమ ఓట్లను వినియోగిస్తాంటారు. ఈసారి ఎన్నికకు ఉదయం రావాల్సిన ఓటర్లు ఎండలకు భయపడి తమ ఓట్లు హక్కును వినియోగించడంలో నిర్లక్ష్యం చేస్తే వాటి ప్రభావం అభ్యర్థులపై పడవచ్చునని పలువురు చర్చించుకుంటున్నారు. ముందుగా ఊహించికున్న రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గెలవాల్సిన పార్టీ ఓటమి చవిచూడడం తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- పలాస

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు అన్నారు. మండలంలోని పెసరపాడు, చినబాడాం, చినబాడాం కాలనీ తదితర గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, మెళియాపుట్టి మండలాలకు సాగునీరుతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఆఫ్‌షోర్ రిజర్వాయరు కాంగ్రెస్ హయాంలో నిర్మించారని అన్నారు. ఆ తరువాత వచ్చిన టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి చేస్తామన్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న రిజర్వాయర్లను పూర్తి చేస్తామన్నారు. కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ వంతెన పూర్తి చేసి ప్రజలకు అందిస్తామన్నారు. మున్సిపాలిటీలో తాగునీరు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కొర్ల హేమారావుచౌదరి, బద్రి సీతమ్మ, శ్రీరంగ సురేష్, మజ్జి షన్ముఖరావు, దుప్పల చలపతిరావు, ఉప్పాడ రాజారావు, కొర్ల విశ్వనాథం, ఎన్.భీమారావు, ఎన్.శాంతమ్మలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న త్రినాథ్‌బాబు

నాయకా... నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి- రణస్థలం

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇంకా పోలింగ్‌కు తొమ్మిది రోజులే ఉంది. ప్రస్తుతం వడగాల్పులు వీస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగు తుండటంతో తప్పనిసరిగా రాజకీయ నేతలంతా ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ఒకపక్క ప్రచారం, మరోవైపు భానుడి భగభగ, ఉక్కపోత చికాకు పుట్టిస్తోంది. వడగాల్పులు వెంటాడుతున్నాయి. ఎన్నికల వేళలో పోటీచేసే అభ్యర్థులతో పాటు వారి అనుచరవర్గం ఎక్కువ సమయం బయటే తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల మధ్య గడుపుతున్నారు. ఈ క్రమంలో పోటీ చేసే అభ్యర్థులు, కొందరు రాజకీయ నేతలు ఆరోగ్యాన్ని సైతం పట్టించు కోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాదయాత్రలు, ర్యాలీలు, ఇంటింటా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా తీరిక లేకుండా తిరగడం వల్ల చెమట రూపంలో శరీరంలోని నీరంతాపోయి డీహైడ్రేషన్ ముప్పు పొంచి ఉండే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. పొంచి ఉన్న డీహైడ్రేషన్ ముప్పు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎక్కువ సేపు బయట తిరగడంతో

ఎండలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు (ఫైల్)

నీరసం, నాలుక తడారి పోవడం జరుగుతుంది. మూత్రం రంగు మారడం వంటి లాంటి లక్షణాలు కనిపిస్తే నీళ్ల మాత్రమే కాకుండా ఒఆర్ఎస్, ఉప్పు, చక్కెర కలిపి మజ్జిగ, కొబ్బరి నీళ్ల వంటివి తీసుకుంటే శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ తిరిగి భర్తీ చేయవచ్చు. అధిక రక్తపోటు, మధుమేహం తదితర దీర్ఘకాలిక రోగాలతో ఇబ్బంది పడేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. ప్రచారంలో పాల్గొనేవాళ్ల శరీరం డీహైడ్రేట్ కాకుండా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, ఒఆర్ఎస్ తీసుకోవాలి. ఆరోగ్యంపై అశ్రద్ధ వహించరావు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చాలా మంది కాఫీలు, టీలు ఎక్కువగా తీసుకుంటారు. దీంతో జీర్ణకోశ వ్యాధులు పెరిగే అవకాశం ఉంటుంది. మధుమేహం, రక్తపోటు ఉంటే మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి వారు వైద్యులు సూచించిన మందులన్నీ వేసుకోవాలి. ప్రచారం తర్వాత చూద్దాంలే అనుకుంటే అది తీవ్ర ముప్పునకు దారి తీస్తుంది. అధిక క్యాలరీలు, చక్కెర ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇప్పటికే ఈ వ్యాధులు ఉంటే ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా బిపి, మధుమేహ పరీక్షలు చేసుకోవాలి. ఉదయం అల్పాహారం తప్పకుండా తీసుకోవాలి. మధ్యాహ్న భోజనంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఇతర డ్రై ఫ్రూట్స్, ఎక్కువ పీచు ఉండే పదార్థాలు తీసుకోవాలి. సలాడ్‌తో శరీరానికి చల్ల దనం ఉంటుంది. ఆహారంపై అశ్రద్ధ చేస్తే మధుమేహ రోగులకు షుగర్ స్థాయిలు పడిపోయి ఆ ప్రభావం అవయవాల పనితీరుపై పడుతుంది. సమయానికి తేలిక‌పాటి ఆహారం తీసుకుంటే మేలు చేస్తుంది. ఈ వేసవి కాలంలో వైట్ రంగు కాటన్ దుస్తులు ధరించాలి. తలకు టోపీ, కర్ఛీఫ్‌లు రక్షణగా ఉండాలి. ఎండలోంచి వచ్చిన వెం టనే మంచినీరు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం తాగాలి. వడదెబ్బ తగిలిన వాళ్ల ఎక్కువగా ఫ్లూయిడ్స్ పళ్ల రసాలు తీసుకోవాలి. కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్ తీసుకోకుండా ఉండటమే మంచిది.

వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న ఎఎన్ఎం భవాని

బలవర్థక ఆహారం అవసరం

ప్రజాశక్తి- లావేరు

వ్యాధి నిరోధక శక్తిని ప్రతిఒక్కరు పెంపొంది ంచుకోవాలని, బలమైన ఆహారాన్ని తీసుకోవాలని బుడతవలస ఎఎన్ఎం వై.భవానీ అన్నారు శనివారం మెట్టవలసలో వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలమైన రాగి, గంటి జావలు తీసుకోవాలని, తద్వారా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. వేసవి దృష్ట్యా ప్రతిఒక్కరు వేడి తగ్గుముఖం పడితే గాని బయటకు వెళ్లరాదని, కాటన్ దుస్తులు, టోపీలు ధరించాలని, తాగునీరు చెంతనే ఉంచుకోవడం ఉత్తమమన్నారు. అలాగే వ్యక్తిగత పరిశు భ్రత, పరిసరాలు పరిశుభ్రత తప్పనిసరిగా పాటించా లన్నారు. తరుచుగా నీళ్లు, చల్లని పానీయాలు, కొబ్బరి బోండాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంసిహెచ్‌పి భవానీ, అంగన్వాడీ కార్యకర్త ఎం.వరలక్ష్మి, ఆశాకార్యకర్త కె.సావిత్రి తదితరులు ఉన్నారు.

ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పేదల సంక్షేమంతో పాటు నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరాయంగా కృషి చేస్తున్న రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును తిరిగి ఈ ఎన్నికల్లో గెలిపించుకోవాలని మాజీ కౌన్సిలర్ బలగ పుండరీనాథ్ అన్నారు. శనివారం నగరంలోని 25వ డివిజన్ పరిధిలో తుమ్మావీధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పేదల బాగు కోసం నిరంతరాయంగా కృషి చేసిన జగన్మోహనరెడ్డిని మరోమారు సిఎంగా చేయాలన్నారు. మాజీ కౌన్సిలర్ బలగ పుండరీనాథ్, 25వ డివిజన్ బూత్ ఇన్‌ఛార్జిలు గేదెల వెంకటరమణ, భోగెల గిరికుమార్, భద్రాచలం బాలకృష్ణ పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలన, వైసిపి పాలనపై బేరీజు వేసుకోవాలన్నారు. నియోజక వర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న రెవిన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపి అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో మధు, డెక్కటి రమణ, సాయి, కె.రాము, మూర్తి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మశాస్త్ర ట్రస్టు సభ్యుల రక్తదానం

శ్రీకాకుళం అర్బన్: రక్తదానం వలన వేరొకరికి ప్రాణదానం చేయవచ్చని శ్రీ ధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్టు అధ్యక్షులు బరాటం సంతోష్, ఉపాధ్యక్షులు పాలకొండ ప్రశాంత్ అన్నారు. నగరంలోని లైన్స్‌బ్లడ్ బ్యాంకులో రక్త నిధి తక్కువ ఉండటంతో ట్రస్టుసభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రతిఒక్కరూ మానవతా ధృక్పదంతో ఆలోచించి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. దాతలిచ్చే రక్తం ఎంతో మంది ప్రాణాలు కాపాడగలదన్నారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, శివతేజ, బరాటం సాయి సంతోష్, శనపల రాజులు, శనపల మనీష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

సంక్షేమం కొనసాగాలంటే వైసిపిని గెలిపించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైసిపిని గెలిపించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం మండలంలోని కొత్తవలస, పాతూరు, నిమ్మతొర్లాడ, సిరిపింపేట, జి.కె.వలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్లారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని సంక్షేమం, అభివృద్ధి పనులను చేసి చూపించిందన్నారు. గడచిన ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను చేసి చూపించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందని, దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, సంక్షేమాన్ని మన రాష్ట్రంలోనే అమలు చేయడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, వైసిపి నాయకులు కోట గోవిందరావు, వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సోమరాజు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన వైసిపి ప్రభుత్వానికే మళ్లీ ప్రజలు పట్టం కట్టను న్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తాడివలస, గోకర్ణపల్లి, వెంకంపేట, గండ్రేడులో వైసిపి అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారంలో

ఆమదాలవలస : మాట్లాడుతున్న తమ్మినేని

భాగంగా రోడ్ షో నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి అఖండ విజయాన్ని అందించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, సర్పంచ్ చింతాడ మాధురి, సత్యప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి, మండల అధ్యక్షుడు రమేష్ కుమార్, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, బాడాన వెంకట కృష్ణారావు, సర్పంచ్ రేగిడి లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు పాల్గొన్నారు.

టిడిపిలోకి మన్మథరావు

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి దేవస్థానం పాలకమండలి పూర్వపు సభ్యుడు, వైసిపి నాయకులు మండల మన్మథరావు టిడిపిలో చేరారు. శనివారం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఎంపి ప్రజాసదన్‌లో టిడిపి అభ్యర్థులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్‌లు ఆయనకు టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు శ్రీశయన తరగతికి చెందిన పలు కుటుంబాలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్ల పాలనలో అనుసరించిన తీరుతో ప్రజల్లో అసహనం వ్యక్తమవు తోందన్నారు. పార్టీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులకు సైతం అక్కడ విలువ లేక నిస్సహాయస్థితిలో ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు వైసిపికి తగిన బుద్ధి చెపుతారన్నారు. స్వేచ్ఛను హరించే నియంత ప్రభుత్వం కొనసాగుతోందని, అటువంటి నియంత జగన్మోహన్ రెడ్డిని గద్దెదించాల్సిన అవసరం ఉందన్నారు.

అనుచరులతో టిడిపిలో చేరిన మన్మథరావు

మంత్రి ధర్మానకు ముఖ్య అనుచరుల్లో ఒకరుగా ఉన్న మండల మన్మథరావు టిడిపిలో చేరడం శు భపరిణామమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్ మాట్లాడు తూ, ఇటీవల అరసవల్లి, ఫాజులబాగ్ పేటకు చెందిన శ్రీ శయన కుటుంబాలు పెద్దఎత్తున పార్టీలో చేరాయని, ఇప్పుడు మన్మథరావు, ఆయన అనుచరుల చేరికతో పార్టీకి మరింత బలాన్నిచ్చిందన్నారు. శ్రీ శయన సంఘం రాష్ట్ర కన్వీనర్ పట్నాన వెంకటేష్ బాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలం ఇప్పిలి గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు, సానుభూతిపరులు టిడిపిలో చేరారు. వారిని ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు పార్టీలోకి ఆహ్వానించారు.

యాచకుడిని స్వచ్ఛంద సంస్థకు తరలింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మండుటెండలో అనాథలుగా ఉన్న యాచకు లను గుర్తించి వృద్ధాశ్ర మానికి తరలిం చాలని జిల్లా ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశాల మేరకు శనివారం జె.ఆర్ పురం పోలీసు స్టేషన్ పరిధిలోని రణస్థలం మండలం జాతీయ రహదా రిపై మండుటెండల్లో ఉన్న ఓ యాచకుడిని ఎస్ఐ కె.గోవిందరావు గుర్తించి సదరు వ్యక్తికి సపర్యలు చేయించి, కావాల్సిన ఆహారం అందించి, కొత్త బట్టలు వేయించి శ్రీకాకుళంలో ఓ స్వచ్ఛంద సేవా సంస్థకు తరలించారు. ఎవరైనా ఇటువంటి అనాథలు ఉంటే సమాచారం అందించాలని, వారిని అనాథాశ్రమానికి తరలించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి తెలిపినట్టు ఎస్ఐ గోవిందరావు పేర్కొన్నారు.

యాచకునికి దుస్తులను అందజేస్తున్న ఎస్ఐ

టిడిపితోనే అభివృద్ధి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రతిఒక్కరు టిడిపికి ఓటువేసి టిడిపి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని మాజీ ఎంపిపి గొండు జగన్నాధరావు పిలుపునిచ్చారు. మండలం సింగుపురం పంచాయతీలో సర్పంచ్ గుండ ఆదిత్యానాయుడు, మాజీ సర్పంచ్ గుండ మోహనరావు, ఉప సర్పంచ్ కుంచాల ఆదినారాయణ, ఎంపిటిసి పంగ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో బాబు సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అయిదేళ్ల పాలనలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎంపీ అభ్యర్థిగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థిగా గొండు శంకర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

సాంస్కృతికోద్యమంలో

రామారావు పాత్ర కీలకం

శ్రీకాకుళం అర్బన్: విప్లవ సాంస్కృతికోద్యమంలో అరుణోదయ రామారావు అందించిన స్ఫూర్తితో మతోన్మాద ఫాసిజాన్ని ప్రతిఘటించాలని అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రామారావు 5వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించు కుని స్మారక సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం న్యూ డెమొక్రసీ జిల్లా కార్యాలయ ఆవరణలో ఆదివారం స్మారక సభ జరుగు తుందని, ఈ సభకు అరుణోదయ సభ్యులు, వామపక్ష సంఘాల ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న దిగంబర్ ప్రధాన్

చెక్‌పోస్టు తనిఖీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని సరిహద్దులోని వసుంధర చెక్‌పోస్టును ఎన్నికల అబ్జర్వర్ దిగంబర్ ప్రధాన్ శనివారం తనిఖీ చేశారు. ఎన్నికల్లో భాగంగా తనిఖీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే సిబ్బందికి పలు సూచనలు చేశారు. సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండి ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈయన వెంట ఎస్ఐ టి.రాజేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నరికేసిన జీడి చెట్లను పరిశీలిస్తున్న శివాజీ

అరాచకాలకు అడ్డు లేదు

ప్రజాశక్తి- పలాస

వైసిపి నాయకుల అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, జీడి చెట్లను నరికేయడం దారుణమని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. మండలంలోని కేశుపురానికి చెందిన బొడ్డు మహాలక్ష్మి, ఆమె కుమారుడు మోహన్ ఇటీవల వైసిపి నుంచి టిడిపి చేరాని అన్నారు. దీంతో వారి జీడితోటలో చెట్లను వైసిపి నాయకులు నరికేయడం సరికాదన్నారు. దీంతో వారిని శనివారం పరామర్శించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తాను ఎన్నో ఏళ్లు రాజకీయాలు చేశానని, ఎమ్మెల్యే పదవులు చేపట్టానని ఇటువంటి ఘటనలు ఎప్పుడూ చోటు చేసుకోలేదని అన్నారు.. వ్యక్తులపై కక్షలు కట్టి జీడితోటలు నాశనం చేయడం బాధకలిగిందన్నారు. ఆయనతో పాటు జి.కె.నాయుడు, బి.కర్రెయ్య, లబ్బ రుద్రయ్య, మాధవరావు, మామిడి తాతారావు, దామోదర్, లోకనాథం, విజయ్, మహేష్, శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస: ఈ నెల 5న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పలాస విద్యుత్ శాఖ డిఇ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ విద్యుత్ స్టేషన్ పరిధిలో పెంటిభద్ర, జయరామచంద్రపురం, తాళభద్ర, అంబుసోలి, పద్మనాభపురం కాలనీ, ఎరుకోల సత్యారావు కాలనీ, నర్సిపురం, పెసరపాడు, చినబాడాం, అంతరకు, రాజపురం, దంతంరామారావువీధి ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని అన్నారు. మరమ్మతుల పనులు చేపడుతున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజీనామా పత్రాలను చూపిస్తున్న వాలంటీర్లు

వాలంటీర్లు రాజీనామా

వజ్రపుకొత్తూరు: జగన్ గెలుపే మా లక్ష్యంగా పనిచేస్తామని రాజీనామా చేసిన కాంబాలరాయుడు సచివాలయం వాలంటీర్లు అన్నారు. సత్య, ధనలక్ష్మి, ఝాన్సీ, రాజేశ్వరి, పద్మలత, హరతి, శిరీష, గీత తమ వాలంటీర్ ఉద్యోగాలకు శనివారం రాజీనామాలు చేసి ఆ పత్రాలను సచివాలయం సెక్రటరీ శ్రీనివాసరావుకు అందజేశారు. ఇది వరకే ఐదుగురు వాలంటీర్లు రాజేష్, మూర్తి, ప్రదీప్, రమేష్ శివాజీ రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశామని అన్నారు. గౌరవ వేతనంతో సేవా చేసి ప్రజలకు, ప్రభుత్వానికి వారధిక నిలిచిన తమపై కొంత మంది అభాండాలు వేస్తూ తమ సేవలను కించపరిచారని అవేదన వ్యక్తం చేశారు.

సమాచార కేంద్రం ఏర్పాటు ఎప్పుడు?

ప్రజాశక్తి- టెక్కలి

సమాచార పౌరసంబధాల శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన టెక్కలి డివిజన్ కార్యాలయం ఏర్పాటులో జాప్యం జరుగుతుంది. జిల్లా విభజన నేపథ్యంలో టెక్కలి డివిజన్ సమాచార పౌరసంబంధాల శాఖా కార్యాలయం మూసి వేశారు. ఆప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉద్యోగుల్లో ఒకరిని జిల్లా కేంద్ర కార్యాలయానికి, మరొకరిని పార్వతీపురం మన్యం జిల్లా కేంద్ర కార్యాలయానికి బదిలీ చేశారు. రెండేళ్ల క్రితం మూసివేసిన ఈ కార్యాలయం ఇప్పటి వరకు తెరుచుకోలేదు. టెక్కలి డివిజన్ కేంద్రం కావడంతో పలు కార్యాలయాలకు అందుబాటులో ఉన్నాయి. కానీ, ఇక్కడ సమాచార పౌర సంబంధాలశాఖ కార్యాలయం ఏర్పాటు అవసరం. ఇక్కడ కార్యాలయం లేకపోవడంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

స్థానికంగా గ్రంథాలయం లేకపోవడంతో సమాచార పౌర సంబంధాలశాఖ కార్యాలయానికి గతంలో పాఠకులు వచ్చి పేపర్లు, వివిధ రకాల పుస్తకాలు, ప్రభుత్వానికి సంబంధించిన విషయాలపై అవగాహన ఏర్పాటు చేసుకునేవారు. పలు కార్యక్రమాలు, పత్రికలకు అందించేందుకు సహకారంగా అందుబాటులో సమాచారశాఖ కార్యాలయం ఉండేది. అటువంటి సమాచార పౌర సంబంధాలశాఖ కార్యాలయం టెక్కలిలో ఏర్పాటు కాకపోవడంతో పలువురు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లాస్థాయి అధికారులు స్పందించి డివిజన్ కేంద్రమైన టెక్కలిలో సమాచార పౌర సంబంధాల శాఖా కార్యాలయం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బిజెపి పొత్తు పార్టీలకు ఓటు వేయొద్దు

పలాస : రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేసిందని, బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన, అలాగే బిజెపికి సహకరిస్తున్న వైసిపి పార్టీలకు ఓటు వేయొద్దని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పలాస ఎమ్మెల్యే అభ్యర్థి పోతనపల్లి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డపాడు, నీలావతి, మాకన్నపల్లి, గురుదాసుపురం ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచుపెడుతున్నారని ఆరోపించారు. ఉద్దాన ప్రాంతంలో ఎలుగుల దాడిలో పదుల సంఖ్యలో మృతి చెందుతున్నా బూర్జ పార్టీలు పట్టించుకోవడం లేదన్నారు. జీడి పిక్కలకు మద్దతు ధర లేక రైతులు అల్లాడిపోతుంటే... టిడిపి, వైసిపిలు జీడికి మద్దతు ధర కల్పించడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. తనకు ఒక్క అవకాశమిస్తే పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. రానున్న ఎన్నికల్లో స్టార్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, దున్న శ్రీను, మద్దిల కైలాస్, మద్దిల పండులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న నాయకులు

ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో ప్రజలకు చేటు

ప్రచారంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- నౌపడ

ప్రభుత్వం తీసుకొస్తున్న ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో ప్రజలకు చేటు కలుగుతుందని టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం లింగోడు పంచాయతీ రాజపురం, కొత్తలింగూడు, మూలపేట పంచాయతీలో విష్ణుచక్రం, సంధిపేట గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం దుర్మార్గాలను అరికడితేనే ఆంధ్రా భవిష్యత్ బాగుంటుందని ప్రజలకు పిలిపించారు. అనంతరం టిడిపి మేనిఫెస్టోలోని ప్రధాన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి టిడిపికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కణితి కిరణ్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జీరు భీమారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

కొత్తూరు: స్థానిక రెల్లివీధికి చెందిన వంద మంది కుటుంబీకులు టిడిపిలోకి శనివారం చేరారు. వీరికి నియోజకవర్గ టిడిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాలన విసిగి టిడిపిలో చేరుతున్నారని అన్నారు. అనంతరం టిడిపి అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మండల కేంద్రానికి వచ్చిన సూపర్ స్పెషలాటీ ఆస్పత్రి సీతంపేటకు తరలించారని అన్నారు. పోలీస్ సర్కిల్ ఆఫీస్‌ను ఎత్తివేసిన ఘనత రెడ్డి శాంతిదేనన్నారు. మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే స్కూల్‌ను కొరసవాడకు తరలించారని తెలిపారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి మామిడి గోవిందరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లోతుగెడ్డ తతబాబు, ఇందిర, కోయిలాపు సంజీవరావు, దుబా చిన్నారావు, ధూళి దాలయ్య, శమ్మాన ఉదయ్‌కుమార్, కూన రాము, పోతల రమణ, బొమ్మాళి సంతు, సేరం లక్ష్మణ, శమ్మాన పకీర్, ధూళి పోలినాయుడు, నీలకంఠం, కోల తిరుపతిరావు పాల్గొన్నారు.

టిడిపి కండువా వేస్తున్న తులసీవరప్రసాదరావు

మాట్లాడుతున్న అన్వేష్

వైసిపి విజయానికి కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జిల్లాల్లో పాస్టర్ల ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి వైసిపి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నట్లు క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ తెలిపారు. ఇచ్ఛాపురంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఎచ్చెర్ల, ఆముదాలవలస, నరసన్నపేట నియోజిక వర్గాల్లో విస్తృతంగా సమావేశం నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో వై.ఎస్. థామస్‌రెడ్డి, అరుణ్‌కుమార్, భీమ్మో, మధుసూదనరావు, ప్రేమనందం, జాన్‌డేవిడ్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపితోనే అభివృద్ధి

ప్రజాశక్తి- కవిటి

రాష్ట్రంలో వైసిపితోనే అభివృద్ధి సాధ్యమని, గత ఐదేళ్లుగా సంక్షేమంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత వైసిపిదని ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ రామారావు అన్నారు. మండలంలోని జగతిలో వైసిపి శ్రేణులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటినీ కలియతిరిగి రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. గత ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి పరాజయం పాలైనా ముఖ్యమంత్రి సహృదయంతో మన నియోజకవర్గ అభివృద్ధికి విరివిగా నిధులు మంజూరు చేశారని, పార్టీలకతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పాలన కావాలంటే వైసిపి పార్టీ అధికారంలోకి రావాలని కోరారు. అనంతరం పలువురు టిడిపి, జనసేన కార్యకర్తలు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పిరియా సాయిరాజ్, నరేష్ కుమార్ అగర్వాల్, ఎన్.నరేంద్ర, కడియాల ప్రకాష్, పూడి నేతాజీ, పూడి వరప్రసాద్, ఎన్.బాబూరావు, యలమంచి నీలయ్య, ఎప్పి నారాయణ స్వామి, ఎన్ని అశోక్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ గణపతి

రాకపోకలకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి- సోంపేట

బారువ రైల్వేస్టేషన్ సమీపంలోని సాయినగర్, హుకుంపేట, రాజీవ్ నగర్ కాలనీవాసుల రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారికి స్థలం విడిచి పెట్టాలని రైల్వే అధికారులను కోరారు. ఈ మేరకు సర్పంచ్ రామ్ బుడ్డి గణపతి, గ్రామ పెద్దలు కలిసి బారువ రైల్వే అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీ వాసులు రాకపోకలు సాగిస్తున్న రైల్వే స్థలంలో అధికారులు గోడ నిర్మించారని అన్నారు. ఆ స్థలాన్ని రాకపోకలకు వీలుగా గోడ నిర్మించాలని కోరారు. దీనిపై ఎంపీ రామ్మోహన్ నాయుడుకు కలిసి అభ్యర్థించనున్నట్లు వారు తెలిపారు.

స్నేహితుల ఆర్థికసాయం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని వింజంపాడుకు చెందిన డోకి జగదీష్ భార్య డోకి జయలక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆ కుటుంబానికి మేము ఉన్నాం... మీకేమి కాదు అని తీవ్ర అనారోగ్యంతో ఉన్న జగదీష్‌కు తన తోటి విద్యార్థులు ధైర్యం చెప్పి ఆదుకున్నారు. 1999-2000 విద్యా సంవత్సరం జర్జంగి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ తమ మిత్రుని కుటుంబ పరిస్థితి తెలుసుకున్నారు. ఆయన ఇద్దరి ఆడ పిల్లల ఉన్నత చదువుల నిమిత్తం రూ.55,500లు ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబానికి మేము ఉన్నామని ధైర్యం చెప్పారు. జగదీష్ మిత్రులు చేసిన సహాయానికి గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గొండు నారాయణరావు, గుంట సోమేశ్వరరావు, బొమ్మాళి సుందరరావు, డోకి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న స్నేహితులు

చెక్కును అందజేస్తున్న అదనపు ఎస్‌పి ప్రేమకాజల్

బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఇటీవల అనారోగ్య సమస్యలతో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్ఐ ఎస్.బెన్నయ్య, ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ కేశవరావు మరణించారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం శాఖాపరంగా మంజూరు చేసిన కార్పాస్ ఫండ్ ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులను అదనపు ఎస్‌పి డాక్టర్ ప్రేమ కాజల్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరిరువురు మరణంచడం చాలా బాధాకరమని, జిల్లా పోలీసు శాఖకు తీరని లోటన్నారు. శాఖా పరంగా రావాల్సిన మిగిలిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సిహెచ్ గోపీనాథ్, క్లర్క్ రామకృష్ణ, కుటుంబ సభ్యులు ఉన్నారు.

మాట్లాడుతున్న ధర్మాన

వైసిపిలో పలువురు చేరిక

శ్రీకాకుళం అర్బన్: నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావుకు మద్ధతుగా నగరంలోని గూనపాలెంకు చెందిన యువత శనివారం మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి ధర్మాన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన దళితులు వైసిపిలో చేరారు. డివిజన్ ఇన్‌ఛార్జి అబ్బాస్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల్లో స్వల్ప మార్పులు

ఎచ్చెర్ల: డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల తేదీల్లో స్వల్పమార్పులు చేశారు. రెండు, నాలుగు సెమిస్టర్ల సప్లిమెంటరీ విద్యార్థులు రాస్తున్న పరీక్షల తేదీలను మాత్రమే మార్పు చేసినట్లు డా.బిఆర్ఎయూ పరీక్షల విభాగం డీన్ డా. ఎన్.ఉదయభాస్కర్ తెలిపారు. ఈ నెల 6, 7 తేదీల్లో ఐసెట్-2024 ప్రవేశపరీక్ష జరుగుతుండటం, ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశానికి ఈ సప్లిమెంటరీ విద్యార్థులకు అర్హత ఉండటంతో పరీక్షల షెడ్యూల్‌లో మార్పు చేసినట్లు తెలియజేశారు. ఈ నెల 6, 7 తేదీల్లో జరగాల్సిన డిగ్రీ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 17, 18వ తేదీల్లో జరుగుతాయని, అదే తేదీల్లో జరగాల్సిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రెగ్యులర్ మోడ్‌లో రాస్తున్న రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షల తేదీల్లో ఎటువంటి మార్పు లేదని స్పష్టం చేశారు. ఈ మార్పును విద్యార్థులు, ఆయా కళాశాలలు గమనించాలని ఆయన సూచించారు.

టిడిపి ప్రచారం

పొందూరు: మండలం రెడ్డిపేటలో టిడిపి అభ్యర్థి రవికుమార్ సోదరుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు, టిడిపి నాయకులు అంబల్ల శ్రీనివాసరావు, హరిబాబు, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు పూర్తి సహకారం

టిడిపి అభ్యర్థి గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న గొండు శంకర్

మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగిందని ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని పొట్టి శ్రీరాములు చేపల మార్కెట్‌లో మత్స్యకారులతో శనివారం నిర్వహించిన ముఖా ముఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బుర్రా సత్తిబాబు, 400 కుటుంబాలతో కలిసి వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వారికి గొండు శంకర్ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం టిడిపి నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ అధ్యక్షతన మార్కెట్ పరిసర డివిజన్‌ల ఇన్‌ఛార్జిలు మైలపల్లి నర్సింహామూర్తి, బుర్రా ప్రసాద్, కొమర కమల, రాజు, బుర్రా సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన ముఖాముఖీ కార్యక్రమంలో శంకర్ మాట్లాడుతూ పార్టీ స్థాపించిన నాటి నుంచి టిడిపికి మత్స్యకారులు అండగా వుంటూ వచ్చారన్నారు. అదే విధంగా వారి సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి టిడిపి కృషి చేసిందని గుర్తు చేసారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే పింఛను మంజూరు చేసిన ఘనత టిడిపిదేనన్నారు. గత అయిదేళ్ల వైసిపి పాలనలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇతర దేశాల్లో చిక్కుకున్న మత్స్యకారులను స్వగ్రామాలకు రప్పించడంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు కృషి ఏ ఒక్క మత్స్యకారుడు మర్చిపోలేనిదన్నారు. బోట్ల మరమ్మతులతో పాటు కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందజేయడం జరుగు తుందన్నారు. జిఒ 217ను రద్దు చేస్తామని, వేట విరామ సమయంలో రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు.ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్ర బాబుకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. వివిధ డివిజన్‌ల ఇన్‌ఛార్జిలు, అనుబంధ విభాగాల నాయ కులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రేరణ ఉత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

లమ్మత అఖిల్

మైత్రి ముంజి

జిల్లాలోని వెన్నెల వలసలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో గత నెల 19న నిర్వహించిన ప్రేరణ ఉత్సవ్‌లో వివిధ పోటీల్లో పాతటెక్కలి జెడ్‌పి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న లమ్మత అఖిల్, టెక్కలి కెజిబివిలో పదోతరగతి చదువుతున్న మైత్రి ముంజి ఎంపికయ్యారు. జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవ్‌లో 30 మండలాల నుంచి 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరంతా మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారే. వారితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమక్షంలో జిల్లా స్థాయిలో వ్యాసరచన, డ్రాయింగ్, పద్యరచన పోటీలను నిర్వహించారు. పోటీలో ఎంపికైన 30 మందికి ముఖాముఖి నిర్వహించి శనివారం వీరిద్దర్ని ఎంపిక చేశారు. వీరిని గుజరాత్‌లోని వాడ్నగర్‌లో ఏడు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్టు వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్. డి.పరశురామయ్య, సమగ్ర శిక్ష ఎఎంఒ జి.లక్ష్మీ నారాయణ తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ విద్యార్థులుగా వీరు రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని డిఇఒ వెంకటేశ్వరరావు, సమగ్రశిక్ష ఎపిసి డాక్టర్ రోణంకి జయప్రకాష్‌లు సూచించారు. విద్యార్థులను వారు అభినందించారు.

టిడిపితోనే మహిళా సంక్షేమం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పోస్టర్లు పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రమీల

టిడిపితోనే మహిళా సంక్షేమం సాధ్యమని పొందూరు మాజీ ఎంపిపి కూన ప్రమీల అన్నారు. శనివారం పురపాలక సంఘ పరిధిలోని 23వ వార్డు లక్ష్ముడుపేటలో ఆమె ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి పోస్టర్లు పంపిణీ చేస్తూ రానున్న ఎన్నికల్లో టిడిపి తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కూన రవికుమార్‌ను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కింజరాపు రామ్మోహన్ నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టోలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సంక్షేమ పథకాలను చంద్రబాబు నాయుడు ప్రకటించారని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, కణితి విజయలక్ష్మి, తమ్మినేని విద్యాసాగర్, గురుగుబెల్లి నాగేశ్వరరావు, కూన ఆంజనేయులు, గోవిందరావు, మురళి పాల్గొన్నారు.

డిఎస్‌పికి ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న కీర్తికుమార్

టెక్కలి రూరల్ : స్థానిక డిగ్రీ కళాశాల దగ్గర ఎన్నికలు పోస్టల్ బ్యాలెట్ జరుగుతున్న సమయంలో ఓ పత్రిక విలేకరి కీర్తికుమార్‌పై కానిస్టేబుల్ శనివారం దాడి చేశారు. అయితే పోలింగ్ అవుతున్న కొద్ది దూరంలో విలేకరులు కూర్చున్నా... వారి దగ్గరకు వచ్చి మీరు ఇక్కడ ఉండకూడదని, వెళ్లిపోవాలని కానిస్టేబుల్ చెప్పారు. దీంతో విలేకరి వెళ్తున్న సమయంలో కానిస్టేబుల్ మెడపై చెయ్యి వేసి ముందుకు నెట్టారు. దీంతో విలేకరి ఆర్‌ఒకి, డిఎస్‌పికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గనియా శ్రీనివాసరావు, కూన సుదర్శనరావు, రఘురాం, ఈశ్వరరావు, బగాది వాసు ఉన్నారు.

సంక్షేమ పాలనకు చిరునామా వైసిపి

ప్రజాశక్తి- కవిటి

ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

సంక్షేమ పాలనకు చిరునామాగా వైసిపి నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. కవిటి మండలం ఇద్దివానిపాలెం, బట్టివాని పాలెం, చిన్నకర్రివానిపాలెం గ్రామాల్లో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపితోనే అభివృద్ధి సాధ్యమని, గత ఐదేళ్లుగా సంక్షేమంతో పాటు అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత వైసిపిదేనని అన్నారు. ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి గోపయ్య, గండుపిల్లి రమేష్, గండుపిల్లి హనుమంతరావు, పిరియా కృష్ణారావు, దుద్ది సతీష్, బైపిల్లి మోహనరావు, బర్రి ప్రకాష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరిమళ, శ్రీదేవి

మరోసారి అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రంలో మళ్లీ రెండోసారి వైసిపి ప్రభుత్వాన్నే గెలిపించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే, విజయనగరం ఎంపీ భార్యలు గొర్లె పరిమళ, బెల్లనా శ్రీదేవిలు ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తకుంకాం, పెదకొత్తపల్లి పంచాయతీల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లోకి వెళ్లి ప్రజలను ఓట్లు ఆర్జించారు. సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగన్మోహన్ రెడ్డి సిఎంగా గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల కల్లబొల్లి మాటలు నమ్మకుండా ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్ కుమార్‌ను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతం నాయుడు, మీసాల శ్రీనువాసరావు, రాజనాయుడు, నడిమింటి కుమారి ఉన్నారు.

అభివృద్ధికి ఓటు వేసి గెలిపించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీకి ఓటువేసి గెలిపించి నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతిఒక్కరు సహకారాలు అందించాలని మాజీ ఎంపిపి సువ్వారి దివ్య ఓటర్లను కోరారు. శనివారం మండలంలోని అక్కివరం, తోటాడ గ్రామాల్లో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి పోస్టర్లను పంపిణీ చేస్తూ స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీకి గ్యాస్ స్టవ్ గుర్తుపై ఓటు వేసి ఒక్క అవకాశం ఇచ్చి అసెంబ్లీకి పంపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో అవినీతి కుటుంబ పాలన, ఆమదాలవలస ఆత్మగౌరవం మధ్య జరుగుతున్నాయని ప్రజలు ఎటు వైపు నిలబడతారో నిర్ణయించుకొని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఓటర్లను కోరారు. అవినీతి కుటుంబ పాలనను అంతమొందించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఆమదాలవలస అభివృద్ధి, ఆత్మగౌరవం మచ్చలేని నాయకుడు సువ్వారి గాంధీతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో సువ్వారి సత్యన్నారాయణ(ఢిల్లీ), బొడ్డేపల్లి మన్మథరావు, చింతాడ మోహనరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు పంపిణీ చేసి ఓటర్లను అభ్యర్థిస్తున్న మాజీ ఎంపిపి దివ్య